

## ఇవిఎంల గోడౌన్‌ను ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్లలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచే కేంద్రాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఇవిఎంల మొదటి స్థాయి తనిఖీ చేపడుతున్న తీరును పరిశీలించారు. ఇవిఎంల తనిఖీలో పాటిస్తున్న నిబంధనలపై సిబ్బందితో ఆరాతీశారు. ఈ తనిఖీ కార్యక్రమంపై రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలపాలని ఆయా పార్టీల ప్రతినిధులను కోరారు. ఇవిఎంల తనిఖీ సంతృప్తికరంగా జరుగుతున్నట్టు వారు సిఇఒకు వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎస్.డి.అనిత, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ పాల్గొన్నారు.

ఇవిఎంల గోడౌన్ తనిఖీకి వచ్చిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్

# ముసుగు దొంగలొస్తున్నారు

## సామాజిక సాధికార బస్సుయాత్రలో మంత్రులు

బహిరంగ సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న మంత్రులు బూడి ముత్యాలనాయుడు, బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముసుగులు వేసి టిడిపి, జనసేన దొంగలు వస్తున్నారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. ముసుగులు వేసుకుని మళ్లీ మోసం చేయడానికి వస్తే ఊరుకుంటారా? అని ప్రజల్ని ప్రశ్నించారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర శనివారం శృంగవరపుకోట పట్టణానికి చేరుకుంది. తొలుత బస్సుయాత్రలో భాగంగా జామి మండలం అలమండలోని జగనన్న కాలనీలో లబ్ధిదారుడు నిర్మించుకున్న ఇంటిని మంత్రి బొత్స ప్రారంభించారు. స్థానికంగా ఉన్న సచివాలయాన్ని సందర్శించారు. అనంతరం శృంగవరపుకోటలో దేవి గుడి కూడలిలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది వైసిపి ప్రభుత్వమేనని తెలిపారు. వెనుకబడిన తరగతులకు సామాజిక, రాజకీయ సాధికారతను సిఎం జగన్ ఇచ్చిచూపారన్నారు. ఎన్నికల్లో ఏం చెప్పామో, పాలనలో ఏం చేశామో ప్రజలకు చెప్పడానికే మీ ముందుకు వస్తున్నామని వివరించారు. ఎన్నికల్లో ఇష్టానుసారం హామీలు ఇచ్చేసి, ప్రజలను నుంచి పారిపోయే పరిస్థితి తమకు లేదన్నారు.

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు రైతులను, డ్వాక్రా మహిళలను, ప్రజలను మోసం చేశారన్నారు. ఆలీబాబా దొంగల తరహాలో కేబినెట్ ఏర్పాటు చేసి దోచుకున్నారని మండిపడ్డారు. జన్మభూమి కమిటీలు వేసి ప్రతీ పనికి లంచాలు వసూలు చేశారని ధ్వజమెత్తారు. వృద్ధులు నెలకు మూడు వేల రూపాయల పింఛను తీసుకునే రోజు దగ్గరలోనే ఉందని ప్రకటించారు. ఎస్.కోట గడ్డ.. వైసిపి అడ్డా అని ఎమ్మెల్సీ కుంబా రవిబాబు అన్నారు. సామాజిక సాధికారతను వైసిపి సాధించిందో, లేదో చెప్పడానికి సభకు వచ్చిన జనమే నిదర్శనమని ఉద్ఘాటించారు.

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ అవినీతి చేసి జైలుకు వెళ్లిన చంద్రబాబుకు సానుభూతి కావాలని టిడిపి నేతలు బస్సుయాత్ర చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. విజయనగరం జిల్లాలో టిడిపి కేబినెట్ మంత్రి పదవులు విజయనగరం, బొబ్బిలి రాజుల కుటుంబాలకే ఇస్తారని, జగన్ సామాజిక న్యాయం పాటించి కేటాయించారని వివరించారు.

కార్యక్రమంలో వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కంబాల జోగులు, శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, అలజంగి జోగారావు, జిసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి, తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబును ప్రభుత్వం ఇరికించినట్లు రాద్ధాంతం

**జామి** : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అవినీతి చేసినందుకే జైలుకు వెళ్లారని, కానీ వైసిపి ప్రభుత్వం ఇరికించినట్లు రెండు, మూడు చానళ్లు రాద్ధాంతం చేస్తున్నాయని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. శనివారం జామి మండలం అలమండ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుషికొండపై రాద్ధాంతం చేస్తున్నది కేవలం కొన్ని మీడియా సంస్థలు తప్ప మరొకటి కాదని కొట్టిపారేశారు. ప్రభుత్వం ఎటువంటి అక్రమ నిర్మాణాలకు పాల్పడటం లేదని, కేవలం హైకోర్టు, సుప్రీంకోర్టుల ఆదేశానుగుణంగా పనిచేస్తుందని వెల్లడించారు. కులగణన ప్రక్రియపై స్పందిస్తూ, అది జరిగితే, కులాల ప్రాతిపదికన హక్కుల సాధనకు ప్రయత్నించడం జరుగుతుందనీ చెప్పుకొచ్చారు. జిందాల్ ప్రాంతాన్ని పారిశ్రామికవాడగా తీర్చిదిద్దితామని తెలిపారు. రైలుప్రమాద బాధితులను ఆదుకోవడంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సఫలీకృతమైందన్నారు. ప్రమాదం జరిగిన రెండో రోజే ముఖ్యమంత్రి బాధితులను పరామర్శించి తగిన ధైర్యం చెప్పారని గుర్తుచేశారు. సమావేశంలో వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ ఇన్‌ఛార్జి వైవి సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు చిన్న శ్రీను, ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైసిపి మండల అధ్యక్షులు గొర్లి రవికుమార్ పాల్గొన్నారు.

### బస్సు యాత్రకు రాకుంటే 'చేయూత' కట్!

**జామి** : వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్రకు రాకుంటే మహిళలకు అందిస్తున్న జగనన్న చేయూత పథకాన్ని కట్ చేస్తామని, డ్వాక్రా మహిళలను సంఘం నుంచి తొలగిస్తామని వైకెపి అధికారులు, వాలంటీర్లు బెదిరింపులకు దిగారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసిపి మీటింగులకు రావాలని భయపెట్టారు. శృంగవరపుకోట పట్టణంలో శనివారం వైసిపి సామాజిక సాధికార బస్సుయాత్ర బహిరంగ సభ ఏర్పాటుచేశారు. జనాన్ని స్వచ్ఛందంగా సభలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలి. కొన్నిసార్లు డబ్బులు ఇచ్చి మరీ ప్రజలను రాజకీయ పార్టీల సభలకు తరలిస్తూ ఉండడం సహజం. కానీ వైసిపి పెద్దలు ఒకడుగు ముందుకేసి, ప్రభుత్వ అధికారులను, సంక్షేమ పథకాలను పావులుగా వాడుతున్నారు. ఏకంగా అధికార పార్టీ వద్ద ఉన్న వాలంటీర్, సచివాలయ వ్యవస్థను, వైకెపి సిబ్బందిని జనాన్ని పోగేసే ప్రక్రియకు పావులుగా వాడుతున్నారు. జామి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అధికారులే సభకు ప్రజలను పోగేసే బాధ్యత తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు బయటపడకుండా, ఆయా శాఖల కింద స్థాయి సిబ్బందిని ఈ పనికి పురమాయించారు. దీంతో పెద్ద ఎత్తున పేదలు అనివార్యంగా సభలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు గగ్గోలు పెడుతున్నారు.

సమావేశానికి హాజరైన అధికారులు
మాట్లాడుతున్న సివిల్ సప్లై కమిషనర్ అరుణ్‌కుమార్

## ధాన్యం ఎంత తెచ్చినా కొనాల్సిందే

- రైతు సంతృప్తే లక్ష్యంగా కొనుగోలు ప్రక్రియ
- 5 రోజుల్లోనే నగదు జమ చేస్తాం
- సివిల్ సప్లై కమిషనర్ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి-విజయనగరం

రైతులు కొనుగోలు కేంద్రాలకు ఎంత ధాన్యం తెచ్చినా కొనాల్సిందేనని సివిల్ సప్లై కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్.. అధికారులను ఆదేశించారు. రైతు పూర్తిగా సంతృప్తి చెందేవిధంగా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో శనివారం ఆయన పర్యటించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో సమీక్షించారు. ముందుగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ జిల్లాలోని పరిస్థితిని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు చేస్తున్న ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఏడాది సుమారు 4,63,624 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. దీనిలో స్థానిక అవసరాలు పోనూ, మార్కెట్‌కు సుమారుగా 4,05,200 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందన్నారు. దీనిలో దాదాపు 3.41 లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు వివరించారు. జిల్లాలో 510 రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయని, 246 క్లష్టర్లుగా ఏర్పాటు చేశామని తెలిపారు. నవంబరు 15 నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని చెప్పారు.

కమిషనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ లక్ష్యానితో సంబంధం లేకుండా రైతులు ఎంత ధాన్యం తెచ్చినా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు మేలు జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మిల్లు సామర్థ్యం బట్టే లక్ష్యాలు కేటాయించాలని, ఎక్కువ బ్యాంకు గ్యారంటీ ఇచ్చినా, సామర్థ్యం కంటే అదనంగా ధాన్యం కేటాయించవద్దని స్పష్టంచేశారు. ఒక్కో ఆర్‌బికెకి 10 నుంచి 15 వాహనాలను కేటాయించాలని, ప్రతీ వాహనానికి జిపిఎస్ పరికరాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గోనె సంచులు, లేబర్ ఖర్చులను రైతులే చెల్లిస్తే, వారికి జమ చేస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 5 రోజుల్లోనే రైతులకు డబ్బు చెల్లించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. సమీక్షా సమావేశంలో డిఎస్ఒ మధుసూదనరావు, సివిల్ సప్లై కార్పొరేషన్ డిఎం మీనాకుమారి, జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, ఇతర జిల్లా అధికారులు, సివిల్ సప్లై డిటిలు తదితరులు పాల్గొన్నారు.

## 15న ప్రజారక్షణ భేరి బహిరంగ సభ

### విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని పిలుపు

చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని, నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో చలో విజయవాడ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయకుండా, రావాల్సిన నిధులు విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా.. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కేంద్రాన్ని ప్రశ్నించకుండా బిజెపికి కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజా ఉద్యమాలను చేపట్టిన వారిపై నిర్బంధాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ప్రజారక్షణభేరి బస్సు యాత్రను సిపిఎం చేపట్టిందన్నారు. రక్షణ భేరి ముగింపు సందర్భంగా ఈ నెల 15న విజయవాడలో బహిరంగ సభ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. బహిరంగ సభకు జిల్లా నుండి వేలాదిగా ప్రజలు తరలిరావాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, టివి రమణ పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న పిపిఎస్ఎస్, అయ్యప్పనగర్ కాలనీ అసోసియేషన్ నాయకులు, కాలనీ వాసులు

### అధికారుల నిర్లక్ష్యానికి

## నెల రోజుల్లో ముగ్గురు బలి

- పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆగ్రహం
- కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'అయ్యప్పనగర్ నుంచి ప్రధాన రహదారిపైకి వచ్చే చోట స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో నెల రోజుల్లో ముగ్గురు మరణించారు. అయినా మున్సిపల్ అధికారుల్లో చలనం లేదు. ఇంకెంత మంది ప్రాణాలు పోవాలో అధికారులే సమాధానం చెప్పాలి' పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, అయ్యప్పనగర్ పోరాట కమిటీ కన్వీనర్ యుఎస్ రవికుమార్ ప్రశ్నించారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ గత రెండేళ్లుగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలని అనేక మార్లు అధికారులకు వినతి పత్రాలు సమర్పించామన్నారు. చివరికి డిప్యూటీ స్పీకర్ కాలనీకి వచ్చి, తమ ముందే కార్పొరేషన్ డిఇకి చెప్పినా అధికారుల నుంచి స్పందన కరువైందని ఆవేదన వ్యక్తంచేశారు.

వెంటనే అధికారులు స్పందించి, అయ్యప్పనగర్ మెయిన్ రోడ్, హనుమాన్ నగర్ వద్ద వెంటనే స్పీడ్ బ్రేకర్లు వేయాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మేనేజర్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ. అయ్యప్పనగర్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్.సుదీర్, అయ్యప్పనగర్ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## తప్పల్లేకుండా ఓటర్ల జాబితా

ప్రజాశక్తి-విజయనగరం, బొండపల్లి

ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఓటర్ల జాబితాల్లో ఎలాంటి తప్పులూ లేకుండా తయారు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి.. బిఎల్ఒలను ఆదేశించారు. పోలింగ్ సమయంలో ఓటర్ల జాబితాలకు పూర్తి బాధ్యత బిఎల్ఒలదేనని స్పష్టంచేశారు. కెఎల్‌పురంలోని 23, 24 పోలింగ్ స్టేషన్లను, గొట్లాం జిల్లా పరిషత్తు హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద చేపడుతున్న ప్రత్యేక శిబిరాన్ని శనివారం కలెక్టర్ సందర్శించారు. బిఎల్ఒలను అడిగి ఓటర్ల జాబితాలను పరిశీలించారు. జాబితాలో అక్కడక్కడ ఫొటోలు లేకుండా ఉన్న ఓటర్లను గమనించి ఫొటోలను తప్పకుండా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఫారం-6 , ఫారం-8 ఎన్నెన్ని వచ్చాయి? ఎలా పరిష్కరించారని ప్రశ్నించారు. వందేళ్లు దాటిన వారు ఎంత మంది ఉన్నారని అడిగారు. మరణించిన ఓటర్లు డూప్లికేషన్లు లేకుండా చూడాలన్నారు. ప్రత్యేక శిబిరాల తర్వాత ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాల క్రాస్‌చెక్ చేసి చూడాలని అన్నారు. ఇరుపార్టీల బిఎల్ఎలతో మాట్లాడి స్పెషల్ కాంపెయిన్ ఎలా జరుగుతుందని అడిగారు. అర్హులైన వారందరినీ ఓటర్లుగా చేర్పించాలని కోరారు. గొట్లాం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎంతో మాట్లాడారు. బయట ఎందుకు తరగతులను నిర్వహిస్తున్నారని అడిగారు. నాడు-నేడు భవనాలు నిర్మాణంలో ఉన్నాయని, 9, 10వ తరగతుల విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం తెలిపారు.

## అన్న ప్రసాద భవనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన నిత్య అన్నప్రసాద వితరణ భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. రూ.1.50 కోట్లతో నిర్మించిన మూడంతస్తుల భవనాన్ని కోలగట్ల, శ్రావణ చైతన్యానంద చిన్న స్వామి ప్రారంభించారు. పుల్కా తయారీ యంత్రాన్ని సీనియర్ కార్పొరేటర్ కేదారి శెట్టి సీతారామమూర్తి ప్రారంభించారు. నారాయణం శ్రీనివాస్ అర్చక భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పిల్ల రాధా భవాని, ప్రాజెక్టు చైర్మన్ బొడ్డు సత్యనారాయణ, కో-ప్రాజెక్టు చైర్మన్ మడిపల్లి రామారావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ పి.విజయరామయ్య, కార్యదర్శి పి.కామరాజు, స్థలదాత ఎం.అప్పలరాజు, గ్రంధి గుప్త పాల్గొన్నారు

# ఏ యాత్ర.. ఎవరి కోసం?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో వైసిపి సామాజిక సాధికార యాత్ర చేపట్టింది. జగనన్న మళ్లీ ఎందుకు రావాలంటూ మరో యాత్ర. అటు టిడిపి నాయకులు 'నువ్వే భవిష్యత్తు, న్యాయం గెలవాలి' అంటూ యాత్రల పరంపర సాగింది. ఇంకా మన జిల్లా వరకు సాగకపోయినా జనసేన అధినేత వారాహియాత్ర పొరుగు జిల్లాల వరకు వచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో సిపిఎం కూడా గడిచిన వారంలో నాలుగు రోజులపాటు విజయనగరం ఉమ్మడి జిల్లాలో ప్రజారక్షణ భేరి పేరిట బస్సు యాత్ర చేపట్టింది. ముఖ్యంగా సామాజిక సాధికార యాత్ర పేరిట వైసిపి చేపట్టిన బస్సుయాత్రలో జనాల్ని తరలింపునకు అధికార బలాన్ని ప్రయోగించారు. అక్కడక్కడా బెదిరింపులు, బుజ్జగింపులు కూడా చోటుచేసుకున్నాయి. డబ్బు, మద్యం పంపకాలు కూడా కనిపించాయి. ఇటు టిడిపి చేపట్టిన యాత్రల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. కానీ, సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరికి జనాలు తండోపతండాలుగా వచ్చేయకున్నా, వచ్చిన వారంతా స్వచ్ఛందంగా, అకుంఠిత దీక్షతో, అంత:కరణ శుద్ధితో వచ్చారనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో గత నెల 30న ప్రారంభమైన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర కురుపాం, పార్వతీపురం, సీతానగరం మండలం చినబోగిలి, మక్కువ, సాలూరు, మెంటాడ, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలం బుడతనాపల్లి, తామరాపల్లి మీదుగా శృంగవరపుకోట మండలంలోని బొడ్డవర జంక్షన్ వరకు సాగింది. అక్కడి నుంచి అనంతగిరి మీదుగా ఈ నెల ఒకటో తేదిన అల్లూరి జిల్లాలోకి ప్రవేశించింది. శ్రీకాకుళం జిల్లా మందసలో ఈ నెల 2న ప్రారంభమైన మరో రక్షణ భేరి యాత్ర 3వ తేదీ ఉదయం 8:30 గంటలకే విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండల కేంద్రానికి చేరుకుంది. అక్కడి నుంచి విజయనగరం, భీమసింగి, జామి, ఎస్.కోట మీదుగా కొత్తవలస వరకు సాగింది. సుదీర్ఘమైన ఈ రక్షణ భేరి యాత్ర విజయవంతానికి జనాన్ని కూడగట్టడానికి వైసిపి, టిడిపి మాదిరిగా బస్సులు, ట్రక్కులు వంటి వాహనాలను సమకూర్చలేదు. బిర్యానీ, మందు వంటివి అసలే పంచలేదు. అయినా సరే ఎంతచెట్టుకు అంతగాలి అన్నట్టుగా జనాలు వచ్చారు. అదీ స్వచ్ఛందంగా, సొంత ప్రయాణ ఖర్చులతో రావడం విశేషం. ఇంకా చెప్పాలంటే సీతంపేట, కురుపాం, మక్కువలో సాగిన యాత్రలో భాగస్వామ్యమయ్యేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన గిరిశిఖర గ్రామాల గిరిజనులంతా తెల్లారక ముందే నిద్రలేచి.. కాలినడకన కొండలు, గుట్టలు దాటుకుంటూ వచ్చారు. చంకల్లో చంటిబిడ్డలు, చేతిలో సంచులు పట్టుకుని మహిళలు సైతం రావడం గమనార్హం.

అధికార, ప్రతిపక్ష పార్టీలు చేపట్టిన యాత్రలో దాదాపు ఒకరినొకరు, దుమ్మెత్తిపోసుకుంటూ తీవ్ర పరుష పదజాలాలతో విమర్శలు చేసుకోవడం, లేదా గొప్పపార్టీలని తమకు తామే కితాబిచ్చుకోవడం వంటివి కనిపించాయి. ఒకరిపై ఒకరి నిందలు, ఆరోపణలు, బూతుపురాణాలతో కాలం గడిపారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య విలువలు, నిరుద్యోగం, మూతపడ్డ పరిశ్రమల గురించి ఆ పార్టీలకు చెందిన నాయకులూ స్పందించలేదు. ఈ నేపథ్యంలో పాలకపార్టీల




యాత్రలకు, సిపిఎం చేపట్టిన యాత్రకు స్పష్టమైన తేడా కనిపిస్తోంది. తేడా మాత్రమే కాదు. ఆయా పార్టీలు ప్రజల్ని ఎలా మోసం చేస్తున్నాయన్న క్లారిటీ కూడా కొంతమంది వద్ద వ్యక్తమౌతోంది. సిపిఎం నాయకులు ఒక స్పష్టమైన ప్రత్యామ్నాయ రాజకీయ వైఖరితో ముందుకొచ్చారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రదర్శించిన నిర్లక్ష్యం, కేటాయింపులు గణాంకాలతో బట్టబయలు చేశారు. మూతపడ్డ ఫెర్రో ఎల్లాయిస్‌ను, జ్యూట్ మిల్లులను, చక్కెర కర్మాగారాలను తెరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజన హామీలు నెరవేర్చకపోవడం, దాని వల్ల మన రాష్ట్రం వెనుకబడిన తీరుతెన్నులు, తీరని అన్యాయాన్ని ప్రజలకు వివరించారు. అలా ద్రోహం చేసిన బిజెపితో వైసిపి, టిడిపి ఎలా కుమ్మక్కు అవుతున్నాయో వివరించారు. ప్రజలపై భారాలు మోపే విద్యుత్ సంస్కరణలు, ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం వంటి ప్రజారక్షణకు దోహపడే చట్టాలకు తూట్లుపొడిచే అంశాలపై పార్లమెంట్‌లో వైసిపి, టిడిపి సభ్యులు చేతులెత్తి మరీ బిజెపికి మద్దతు పలికిన తీరును, రాష్ట్రంలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అన్నట్టుగా ఉండే వ్యవహార శైలిని కూడా ఎండగట్టారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి సిపిఎం నాయకులకు మంచి ఆదరణ లభించింది. యాత్రలో ఆగిన ప్రతిచోటా హారతి పడుతూ, తిలకం దిద్దుతూ స్వాగతం పలికారు. డప్పుల దరువులు, గిరిజన సంప్రదాయ నృత్యాలు, కోలాటాలతో తమ నాయకుల రాకను జనానికి తెలియజేసే ప్రయత్నం చేశారు. ఈ యాత్ర వచ్చే ఎన్నికల్లో రాజకీయాలను ఏమేరకు ప్రభావితం చేస్తుందన్నది కాస్త పక్కనబెడితే, తద్వారా ఎంతో కొంతమంది అభ్యుదయ, వామపక్ష, ప్రజాతంత్ర వాదులు, సిపిఎం అభిమానులు, కార్యకర్తలు రాజకీయంగా మరింత చైతన్యవంతులై సమాజాభివృద్ధి భాగస్వామ్యం అవుతారనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

బొబ్బిలి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు

## విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 8న జరగనున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు మణికుమార్, రవికుమార్, కె.అప్పన్న కోరారు. బంద్ వాల్‌పోస్టర్లను శనివారం విడుదల చేశారు. విశాఖ ఉక్కు ఉద్యమం ప్రారంభించి వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమను స్థాపించాలని డిమాండ్ చేశారు. బంద్‌కు విద్యా సంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

**నెల్లిమర్ల:** విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 8న జరిగే విద్యాసంస్థల బంద్‌ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్‌ను జయప్రదం చేయాలని శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, విశాఖ ఉక్కు అమ్మకానికి వ్యతిరేకంగా నిలబడాలనే ఉద్దేశ్యంతో నవంబర్ 8న బంద్ చేపట్టి, విద్యార్థి లోకాన్ని ఐక్యం చేసి విద్యార్థి ఉద్యమాల ద్వారా విశాఖ ఉక్కుని కాపాడుకుంటామని చెప్పారు. కడప ఉక్కుని సాధించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె.రవి కుమార్, విద్యార్థులు పవన్ కుమార్ , రవి తదితరులు పాల్గొన్నారు.

## 8న తెర్లాంలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి- తెర్లాం

ఈ నెల 8న స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఎంపిడిఒ ఎస్. రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి హాజరవుతారని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

## పాఠశాలకు రూ.10 వేలు వితరణ

**డెంకాడ :** మండలంలోని రఘుమండ జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలకు విజయనగరం భీమా సంస్థ అడ్మినిస్ట్రేషన్ అధికారి కట్టమూరి భాస్కరరామ్మూర్తి కుటుంబ సభ్యులు శనివారం రూ. 10వేలు వితరణగా అందించారు. భాస్కర రామ్మూర్తి కుమార్తె సాయి సత్య సంజనకు ఉద్యోగం వచ్చిన సందర్భంగా పాఠశాలకు ఈ వితరణ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్ పిల్లా శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు కె. సౌభాగ్యలక్ష్మి, ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు ఐఎస్ఇ శర్మ, సర్పంచ్ గూడేల విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు గౌరీ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆవిష్కరణల పేటెంట్స్‌తో భవిష్యత్తుకు పునాది

**డెంకాడ:** ఆవిష్కరణల పేటెంట్స్‌తో దేశ భవిష్యత్తుకు పునాది వేయవచ్చునని సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సైంటిస్ట్ విమల్ కుమార్ వరుణ్ పిలుపునిచ్చారు. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెల్, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్, ఎంట్రప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ సెల్ సంయుక్తంగా పెటెంట్ ఇన్ఫర్మేషన్, ఐపిసి అండ్ ఇ-లెర్న్ అంశం పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విమల్ కుమార్ వరుణ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు పేటెంట్స్ ఏవిధంగా ఉపయోగపడతయో వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేటెంట్స్ ఏ విధంగా రిజిస్టర్ చేసుకోవాలో వివరించారు. రానున్న కాలంలో ఈ పేటెంట్స్ ద్వారా వినూత్నమైన ఆవిష్కరణలు దేశ పురోగతికి వాణిజ్య రంగంలో పుంజుకోటానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తమ్మినేని హరిబాబు, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెల్ ఇంచార్జి డాక్టర్ ఏవి. పరాంకుశం, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్స్, ఎంట్రెపెనూర్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్స్, పలు విభాగాధిపతులు, డాక్టర్ పి.తిరుమల, డాక్టర్ వి.ప్రసాద్, డాక్టర్ బి. శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల రవాణాకు చెక్

**బొబ్బిలి :** స్థానిక ఎస్ఇబి సిఐ ఆర్. జైభీమ్ ఆధ్వర్యంలో శనివారం పాత బొబ్బిలి జంక్షన్ వద్ద వాహన తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ లాంటి నిషేధిత పదార్థాలు, నాటుసారా, అక్రమ మద్యం రవాణా అవకుండా నిరోధించేందుకు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇటువంటి తనిఖీలకు వాహన దారులందరు సహకరించాలని సిఐ కోరారు. నాటుసారా, అక్రమ మద్యం రవాణా, ఇతర మత్తుమందుల రవాణాకి సంబందించిన సమాచారం 9440902372 తెలియజేయాలని కోరారు.

## మూగజీవికి వైద్యం

**బొబ్బిలి:** స్థానిక కృష్ణా టాకీస్ స్థలంలో స్పృహ తప్పి పడిపోయిన ఆవుకు ఇద్దరు యువకులు సహకారంతో పశువైద్య ఉద్యోగి వైద్య మందించారు. శనివారం స్పృహ కోల్పోయి ఆవు పడి ఉండడాన్ని గమనించిన ఇద్దరు యువకులు పశువైద్య ఉద్యోగికి సమాచారం అందించారు. పశు వైద్య ఉద్యోగి ఆవు వద్దకు చేరుకుని చికిత్స అందించారు. మూగజీవి పట్ల మానవత్వాన్ని చూపు వైద్యమందించిన యువకులు, పశు వైద్య ఉద్యోగిని పలువురు అభినందించారు.

## సిసి రోడ్డు నిర్మాణం పూర్తి

**రేగిడి:** మండలంలోని సంకిలి పంచాయతీ పరిధి బొడ్డవలస గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 6 లక్షలతో 130 మీటర్ల సీసీ రోడ్డును నిర్మించినట్లు సర్పంచ్ బుడుమూరు పట్టాభి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి సిసి రోడ్డు నిర్మాణం లేక ఇబ్బందులకు గురవుతున్నాని దీంతో వారి సమస్య తొలగిందని అన్నారు. అనంతరం సీసీ రోడ్డును ఆయన పరిశీలించారు. వీరితోపాటు సంకిలి వైసిపి నాయకులు మజ్జి శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అంబళ్ల ప్రవల్లిక ఉన్నారు.

## అరుదైన గ్రూపు రక్తదానం

**నెల్లిమర్ల:** విజయనగరం గోషా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శ్రావణి అనే గర్భిణికి అరుదైన బ్లడ్ గ్రూప్ బి నెగిటివ్ అవసరమైంది. దీంతో బంధువులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని సంప్రదించగా వెంటనే రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, ఎపిఎం ఆర్ఒ ముడిదాపు రాము సాధన యువజన సంఘం అధ్యక్షులు పి. దుర్గాప్రసాద్‌కు సమాచారమిచ్చారు. దీంతో స్పందించిన దుర్గాప్రసాద్ వెంటనే గుంకలాం గ్రామానికి చెందిన గేడు శ్రీను అనే రక్తదాతను పంపించి రక్త దానం చేశారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంకు రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ పొగురి విశ్వేశ్వరరావు రక్తదాత శ్రీనుని అభినందించారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్ రావు, కార్యదర్శి కె.సత్యం టీమ్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్ ఆర్ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాలనీ ప్రజలు

## పట్టాలు రద్దు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి- బొబ్బిలి

గొల్లపల్లి శ్రీదాడితల్లి కాలనీలో దాడితల్లి కళ్యాణ మండపం కోసం ఉంచిన రిజర్వ్ స్థలంలో ఇచ్చిన పొజిషన్ పట్టాలను రద్దు చేయాలని కోరుతూ గ్రామస్తులు శనివారం ఆందోళన చేశారు. దాడితల్లి కాలనీలో కళ్యాణ మండపం కోసం ఉంచిన రిజర్వ్ స్థలాన్ని కాపాడాలని కోరుతూ శనివారం కళ్యాణ మండపం స్థలం నుంచి దాడితల్లి ఆలయం వరకు ర్యాలీ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కాకల గోవిందమ్మ, మాజీ కౌన్సిలర్ కాకల వెంకటరావు, గ్రామ పెద్ద పి.ఈశ్వరరావు మాట్లాడుతూ దాడితల్లి కాలనీలో కళ్యాణ మండపం కోసం రిజర్వ్ స్థలం కేటాయిస్తే ఆస్థలంలో పొజిషన్‌లో లేనప్పటికీ రాజకీయ ఒత్తిడితో పొజిషన్ పట్టాలు ఇస్తున్నారన్నారు. కళ్యాణ మండపం స్థలంలో ఇచ్చిన పొజిషన్ పట్టాలు రద్దు చేయాలని, ఇక నుంచి పొజిషన్, ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు 26 మంది

ప్రజాశక్తి- నెల్లిమర్ల

జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు 26 మంది ఎంపికైనట్లు కోచ్ చల్లా రాము తెలిపారు. శనివారం కొండవెలగాడలో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికలు జరిగాయి. ఎంపికలో వివిధ కేటగిరీలో 26 మంది ఎంపికైనట్లు తెలిపారు. కాగా ఈ నెల 17,18,19 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరగబోయే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వీరంతా పాల్గొంటారన్నారు. ఈ ఎంపికలో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బి. లక్ష్మీ, కార్యదర్శి చల్లా రాము, పి.వెంకటేష్, బి. అశ్వని, ఆర్ ఎల్ గాయత్రి, కోచ్.ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

### సాఫ్ట్ బాల్ జట్టుకు విద్యార్థులు ఎంపిక

**బాడంగి:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 10 నుండి12 వరకు బాపట్లలో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9 మంది ఎంపికయ్యారని పీడీ గొర్లె బంగారునాయుడు తెలిపారు. శుక్రవారం విజయనగరం రాజీవ్ క్రీడా మైదానంలో జరిగిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో అండర్19 విభాగంలో ఎల్.అరుణ్ కుమార్, బి గోవింద్, డి.విష్ణువర్ధన్, ఎస్.స్వామినాయుడు, కె రోహిత్ కుమార్, ఎస్ కీర్తన, ఎన్.వరలక్ష్మి, టి ప్రియాంక, జి. వైదేహి ఎంపికయ్యారన్నారు. హెచ్ఎం మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

బాడంగి: క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

### నేడు బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు

**తెర్లాం:** మండలంలోని నెమలాం జెడ్‌పిహెచ్ పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని ఆ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.విజయ్‌కుమార్, కార్యదర్శి శ్రీధర్, సుందరరావు,పీడీ సింహాచలం తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారు డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో అనంతపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులు జి. సింహాచలం 9491568645ను సంప్రదించలని కోరారు.

### నేషనల్ అథ్లెటిక్స్‌కు అశోక్

**వంగర:** ఈ నెల 7,8,9 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో జరగనున్న 38వ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి దేవకివాడ అశోక్ ఎంపికయ్యాడని హెచ్ఎం ముద్దాడ రమణమ్మ శనివారం తెలిపారు. ఈ పోటీల్లో లాంగ్ జంప్ విభాగంలో అశోక్ పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అభినందించారు.

వంగర: అశోక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

లెమన్‌అండ్‌స్పూన్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

## పిల్లలకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి- డెంకాడ

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎఫ్.వై.ఎఫ్.పి - ఎమ్.వి.జి.ఆర్. సంయుక్తంగా పాఠశాలల విద్యార్థులకు సాంస్కృతిక, సాహిత్య, సాంకేతిక, పలు క్రీడా పోటీలను శనివారం నిర్వహించాయి. ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రాజెక్ట్ వికాస్, ప్రాజెక్ట్ కితాబ్, ప్రాజెక్ట్ సేతు అనేవి ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా విద్యార్థులకు స్వచ్ఛందంగా వివిధ రకాల సేవలను అందిస్తున్నారు. ఇందులో భాగంగా బాలల దినోత్సవం పురస్కరించుకొని శనివారం చింతలవలస, గుండాలపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో ఎఫ్.ఐ.ఎఫ్.సి వాలంటీర్లు, సమన్వయకర్త కె. సత్యనారాయణ రాజు విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్ యస్ మోహన్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్ షణ్ముఖరావు, విద్యార్థి సమన్వయకర్త బమ్మిడి కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక డ్రైవ్ పరిశీలన

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండంలోని చంద్రంపేటలో శనివారం జరిగిన ఓటర్ల ప్రత్యేక డ్రైవ్‌ను టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్లను చేర్పించడం, మార్పులు ఉంటే పార్టీ తరుపున కచ్చితంగా నాయకులు దగ్గరుండి సరిచేయాలన్నారు. బిఎల్ఒలకు టిడిపి తరుపున నాయకులు సహకరించి ఓటర్ల జాబితాను సక్రమంగా తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**డెంకాడ:** మండలంలోని జరుగుతున్న ఓటర్ల ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా తహశీల్దార్ పి. ఆదిలక్ష్మి పెదతాడివాడ బిఎల్ఒలు నమోదు చేసిన ఓటర్ల జాబితాను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఒలను ఇంటింటికి వెళ్లి కొత్తగా ఓటర్లు ఉంటే నమోదు చేయాలని, చేసిన వాటిని పరిశీలించాలని కోరారు. ఆర్ఐ, బిఎల్ఒలు పాల్గొన్నారు.

**వేపాడ :** మండలంలోని పాటూరు, సోంపురం, గుడివాడ, ఆకుల సీతంపేట, వల్లంపూడి, వేపాడ గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లను, ఓటర్ల ప్రత్యేక డ్రైవ్‌ను ఆర్ఒ సుదర్శన రావు శనివారం పరిశీలించారు. సిబ్బంది పాటించాల్సిన నిబంధనలు గురించి ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్ అప్పలనాయుడు, బిఎల్ఒలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న కడగల ఆనంద్‌కుమార్

# చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- గరివిడి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. శనివారం గరివిడి పట్టణం వినాయక కాలనీ బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించిన మహాశక్తి పథకం రాష్ట్ర మహిళలకు అన్ని విధాలుగా అలంబనగా నిలుస్తుందన్నారు. ప్రతి మహిళకు రూ.1500 ఆర్థిక సహాయం, ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు వంటి ఉచిత పథకాలతో వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయ న్నారు. కచ్చితంగా ఈ పథకాలు రాష్ట్ర మహిళా లోకాన్ని ఆకట్టుకుంటాయని, వారిని ఆదుకుంటాయని తెలిపారు. రాష్ట్రంలోనూ, చీపురుపల్లి నియోజకవర్గంలోనూ వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి అత్యధిక మెజారిటీ రావడం ఖాయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైల బలరాం, సారేపాక సురేష్ బాబు, రెడ్డి గోవింద, యజ్జిపరపు సత్యం, గొట్టిముక్కల సత్తిరాజు, తూట శ్రీను, టేకు నరసింగరావు, రాగోలు సత్యం, శిరపు శ్రీను, వైగాల సత్యం, గంట్యాడ సంతోష్, పద్మ, గరివిడి లక్ష్మి, కుమరపు రమణ పాల్గొన్నారు.

మేనిఫెస్టో పత్రాలను అందిస్తున్న నాగార్జున

# ప్రజల సొమ్ముతో బస్సు యాత్రలా? : టిడిపి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రభుత్వం ప్రజల సొమ్ముతో సామాజిక సాధికార బస్సు యాత్రలు నిర్వహిస్తుందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆరోపించారు. మండల కేంద్రంలోని అన్నా క్యాంటిన్ వద్ద శనివారం ఆమె విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నల్ల బెలూన్లను చేత పట్టుకొని నిరసన ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధికంగా ఓట్ల శాతం ఉన్న బీసీ, ఎస్‌సి వర్గానికి సబ్ ప్లాన్‌లను ఇచ్చినందుకా సామాజిక సాధికార బస్సు యాత్ర.? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై వెంటనే స్పందించినందుకా బస్సు యాత్ర అని ఎద్దేవా చేశారు. కులం చూడం, మతం చూడం, ప్రాంతం చూడం అంటూ ఉత్తరాంధ్రను ఒక రెడ్డికి, రాయల సీమను మరొక రెడ్డికి, కోస్తాంధ్రను ఇంకొక రెడ్డికి ఇస్తూ, రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేసి, మూడు రాజధానుల పేరుతో ప్రజలను మభ్యపెట్టినందుకా ఈ యాత్రలని ప్రశ్నించారు. ప్రభుత్వంలో అన్ని కీలకమైన అధికారాలను, ఆఖరికి ప్రభుత్వ సలహాదారులను కూడా ఒకే సామాజిక వర్గానికి చెందిన రెడ్డలకు కట్టపెట్టినందుకా సామాజిక సాధికార బస్సు యాత్ర? అని ఎద్దేవా చేశారు. గతంలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆధరణ లేకపోవడంతో ఇప్పుడు బస్సు యాత్ర చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని యాత్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, నాయకులు నానిగిరి రమణాజీ, కోనేదం మల్లేశ్వరరావు, భీశెట్టి అరుణ, పొలిమేర లక్ష్మి, బోనంగి జ్యోతి, కాపుగంటి శ్రీనివాసు, చక్కా కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

### బిసి, ఎస్‌టి, ఎస్‌సిలకు ఈ ప్రభుత్వం ఏం చేసింది?

బిసి, ఎస్‌టి, ఎస్‌సిలకు ఈ ప్రభుత్వం ఏం చేసిందని, ఎస్‌సి కులానికి చెందిన సుధాకర్ అనే డాక్టర్ మాస్క్ అడిగినందుకు ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలకు తెలుసునని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. శనివారం రాత్రి ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎస్‌సి కార్పొరేషన్ నుంచి ఎస్.కోట నియోజకవర్గానికి ఎన్ని రుణాలు ఈ ప్రభుత్వం మంజూరు చేసిందో, బీసీ కార్పొరేషన్ నుండి ఎన్ని రుణాలు అందజేశారో చర్చకు రాగలరా అని ప్రశ్నించారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా టిడిపి హయాంలో ఎంతో మందికి వాహనాలు మంజూరు చేశామన్నారు. రాబోయేది చంద్రబాబు ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. టిడిపిలో బిసిలకు రక్షణ ఉండేదని, ఈ ప్రభుత్వంలో లేదన్నారు. 52 కార్పొరేషన్లు ఈ ప్రభుత్వం ఏర్పాటు చేసినా వారు కుర్చీలకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. వాలంటీర్లు, డ్వాక్రా మహిళలపై ఒత్తిడి చేసి సామాజిక సాధికారత బస్సు యాత్రకు జనాలను రప్పించు కున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామ సత్యం, ఆడారి ఉమామహేశ్వరరావు, ధర్మవరం కేవీ సత్యనారాయణ, వినాయకపల్లి సన్యాసినాయుడు, ఎం.మంగరాజు, సిమ్మ అప్పారావు, బంగారు నాయుడు, ఇందుకూరి శ్రీనురాజు పాల్గొన్నారు.

## నేడు జనసేన రైతు గర్జన

ప్రజాశక్తి- భోగాపురం

వర్షా భావం వల్ల ఉమ్మడి విజయనగరం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి రైతు గర్జన' కార్యక్రమాన్ని ఆదివారం నెల్లిమర్ల నియోజకవర్గంలో ప్రారంభిస్తామని నియోజకవర్గం ఇంచార్జి లోకం మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు నెల్లిమర్ల మండలంలోని మల్యాడ నుంచి సతివాడ, ఆల్తిపాలెం, నెలివాడ, రామతీర్థం వరకూ రైతు గర్జన కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆమె కోరారు.

**శృంగవరపుకోట :** జనసేన నియోజకవర్గం నాయకులు వబ్బిన సత్యనారాయణ, సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం వేపాడ మండలం కరకవలసలో రైతు గర్జన కార్యక్రమాన్ని చేపడుతున్నామని వారు ఒక ప్రకటనలో తెలిపారు. వేపాడ మండల అధ్యక్షులు సుంకర అప్పారావు ఆర్థిక సహాయం తలపెట్టబోతున్న ఈ కార్యక్రమానికి ఐదు మండలాల అధ్యక్షులు, నాయకులు, మహిళలు హాజరు కావాలని కోరారు.

# రూ.1.32 కోట్లతో పనులు గుర్తింపు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని పెద్ద శిర్లాంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా వైసిపి నాయకులు, సర్పంచ్ లెంక రాంబాబు అధ్యక్షతన శనివారం గ్రామ సభ నిర్వహించారు. చెరువులు, కల్వర్టులు, సిసి గ్రావెల్ రోడ్లు తదితర 25 నిర్మాణాలకు రూ.1.32 కోట్లతో పనులు గుర్తించామని సర్పంచ్ తెలిపారు. 29,117 పని దినాలను గ్రామసభలో తీర్మానాలు చేసి ఆమోదించారు. ఈ గ్రామసభలో ఎపిఒ సంకాబత్తుల హరినాథ్, టెక్నికల్ అసిస్టెంట్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్స్ వేతనదారులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న సరపంచ్ లెంక రాంబాబు

### వన్నలిలో గ్రామ సభ

మండలంలోని వన్నలి గ్రామంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులకు శనివారం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ వెంకటరమణ అధ్యక్షతన 22 పనులకు రూ.75 లక్షలలతో ఆమోదం పొందినట్లు ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గుర్తించిన పనులకు ప్రతిపాదన తయారు చేసి ఉన్నత అధికారులకు నివేదిస్తామన్నారు. వలస నివారణకు ఉపాధి హామీ పనులు దోహద పడతాయ న్నారు. పంచాయితీ కార్యదర్శి గోవింద, ఈసీ రామి నాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ సారథి, సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్ యర్రయ్య, మేట్లు పాల్గొన్నారు.

# దేవస్థానం భూముల్లో వేలం ఆపాలి

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలోని పాత శ్రీరంగరాజపురం గ్రామంలోని సీతారామస్వామి దేవస్థానానికి సంబంధించిన భూములను వేలం పాట వేయకుండా ఆపాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు కోరారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కౌలు రైతులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం భూముల్లో గత 60 సంవత్సరాలుగా కౌలు రైతులు పంటలను పండించుకుని జీవిస్తున్నారన్నారు. అటువంటి భూముల్లో మూడు రోజులు క్రితం దేవస్థానం అధికారులు వచ్చి వరి పంట కోత తరువాత రెండో పంట వేయవద్దని, ఆ భూములను వేలం పాట వేస్తామని బెదిరించి వెళ్లిపోయారన్నారు. కౌలు రైతులు అక్కడ దేవస్థానానికి వేలాది రూపాయలు చెల్లిస్తున్నారని వెంటనే వేలం పాట ఆపి కౌలు రైతులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కౌలు రైతు సంఘం నాయకులు, కౌలు రైతులు

# ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపిపి పీరు బండి హైమావతి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఇంటి నిర్మాణాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి డుమా పీడీ ఉమా మహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ భవాని, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరు బండి జైహింద్ కుమార్, గ్రామ కార్యదర్శులు, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి పీరుబండి హైమావతి

# పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని కోరాడవీధి, పార్కు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను శనివారం పరిశీలించారు. ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివను ఆదేశించారు. రోడ్లు, కాలువలలో చెత్త వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. మున్సిపల్ పైపులైన్ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

### జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మున్సిపాలిటీలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మెప్మా ఆర్పీలను కమిషనర్ శ్రీనివాసరావు కోరారు. ఇళ్ల నిర్మాణాలపై మెప్మా ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 20 నాటికి ఒకొక్క ఆర్పీ కనీసం ఎనిమిది స్లాబులు వేయాలన్నారు. సమావేశంలో టిపిఆర్ఒ జగన్మోహన్, మెప్మా ఉద్యోగులు పాల్గొన్నారు.

## అనువర్తనాలపై అవగాహన

**నెల్లిమర్ల:** నిత్య జీవితంలో అనువర్తనాలపై అవగాహన ఉండాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి అన్నారు. శనివారం ప్రపంచ రేడియోలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఎస్ఆర్‌టి, ఇండియన్ సొసైటీ ఆఫ్ రేడియోగ్రాఫర్స్ అండ్ టెక్నాలజిస్టులు, సెంచూరియన్ విశ్వ విద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన కంటిన్యూంగ్ మెడికల్ ఎడ్యుకేషన్ సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ సామర్థ్యాలను మెరుగుపరచు కోవాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ రేడియోలజీ విభాగం అధ్యాపక సిబ్బంది విశ్వవిద్యాల యానికి మంచి పేరు తెస్తొన్నారని కొనియాడారు. అనంతరం చెన్నై ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన మురుగేష్, శివనాగేష్, పృద్వీకుమార్, ఎంఎస్ రామయ్య వివిధ అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఆర్ టి రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.రంగారావు, డీన్ ప్రొఫెసర్ ఎం.లక్ష్మీనరసింహ ఆచార్యులు, విభాగాధిపతి నూకరాజు, ఆసిఫ్, అమిత్ శర్మ, ప్రతిభ, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోతిలో పడి ఆవు మృతి

**నెల్లిమర్ల:** స్థానిక చంపావతి నదిలో పడి పాడి ఆవు మృతి చెందింది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం జగ్గరాజుపేటకు గ్రామస్తుడు తాళ్లపూడి రామకృష్ణ అనే వ్యక్తికి చెందిన పాడి ఆవు స్థానిక చంపావతి నదిలోకి మేతకు వెళ్ళింది. ఇసుక కోసం తవ్వేసిన గోతిలో తెలియక దిగి ఊపిరాడక మృతి చెందింది. ప్రాజెక్టు పేరిట అనుమతులున్నాయని ఇసుకను తవ్వేయడంతో ఏర్పడిన గోతుల్లో ఆవు పడి మృతి చెందిందని స్థానికులు చెబుతున్నారు. అనుమతులు ఉన్నాయని కొంతమంది ఇబ్బడి ముబ్బడిగా తవ్వకాలు జరిపి మూగ జీవాల ప్రాణాలు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన ఆవు సుమారు లక్ష రూపాయల ఉంటుందన్నారు.

ఆవును బయటకు తీసుకొస్తున్న స్థానికలు

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**భోగాపురం:** మండలంలోని భోగాపురం నుంచి ముక్కాం వెళ్లే రహదారిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఎస్ఇబి అధికారులతో తోపాటు స్థానిక పోలీసులు కలిసి శనివారం పట్టుకున్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఇబి ఎస్. ఐ రామకృష్ణ, ఎస్ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జగ్గయ్యపేట వద్ద ఈ ట్రాక్టర్‌ను పట్టుకున్నారు.

**IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE, VIZIANAGARAM**
**1.A. 242/2020 IN O.S. 100/2011**

Between:
P. Venkata Rao .....Petitioner/Plaintiff
And:
A. V. Lakshmi .....Respondent/Defendant
To:

**NOTICE**

A.V. Lakshmi D/o Satish, aged about 42 years, Hindu, resident of Muslim Street, Srungavarapukota Village and Mandal, Vizianagaram District,

Please take notice that the petitioner/plaintiff filed the above petition against you and the above matter stands posted to **10.11.2023.** Therefore, you have to appear before the above said court either personally or through an Advocate duly authorized at **10-30 A.M., on 10.11.2023** before the above court. Failing which the matter will be decided as per the material available on record.

**CH. RAMBABU,**
Advocate for Petitioner
Vizianagaram

**IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM**
**M.O.P. 708/19**

**Between :**
Pathiwada Krishnaveni **...Petitioner.**
And :
V.Surappanna and 2 others ...Respondents.

**NOTICE**

**To R-1& R-2**
**1. Venkata Surappanna,**
S/o Narayana, Hindu, Aged 27 years, R/o Savaravilli village, Bhogapuram mandal, Vizianagaram district-535216. (The driver of the lorry bearing No AP 31 TU 5186).
**2.Debendranath Sahu,**
S/o Neelakanta Sahu, R/o D.No 16-61, China Gantyada, Gajuwaka, Visakhapatnam.( The owner of the lorry bearing No AP 31 TU 5186).

Please take notice that the above named petitioner have instituted the above petition against you for compensation with interest and costs. You are hereby summoned to appear before the court in person or through advocate duly instructed and able to answer all material questions relating to the above petition on **16-11-2023 at 10-30 A.M,** in default of your appearance on that day, the matter will be heard and decided in your absence.
**(By order of honourable court of the II Additional District Judge At Visakhapatnam)**

**Betina Srinivas,**
**D.S.R.Rajeswari,**
**Gorli Rajesh,**
**Advocates, Anakapalli.**